క్లుప్తంగా

ప్రజా సంక్షేమానికి సీఎం పెద్దపీట



లక్ష్మీపురం: ప్రతి పేదవాడికీ సొంత స్థలంతో పాటు అందులో ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ అన్నారు. 32వ డివిజన్ చెందిన 127, 128, 129, 130 సచివాలయాల పరిధిలోని 470 మందికి శుక్రవారం బ్రాడీపేటలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని రీతిలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తెలిపారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పాల్గొన్నారు.

మనసున్న మారాజు జగనన్న



లక్ష్మీపురం: పేదల సొంతింటి కలను నిజం చేసిన మనసున్న మారాజు సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అని 34వ వార్డు కార్పొరేటర్ బూసి రాజలత అన్నారు. గుంటూరులోని 121 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు సీఎం జగనన్నతోడుగా నిలిచారని, ప్రతి మహిళకూ సొంత ఆస్తి కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ కె.సురేష్, వీఆర్వో బూసిరాజు శ్రీనివాసరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ నజీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సొంతింటి కల సాకారం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ ఫారాలు
- మహిళలకు జగనన్న ప్రథమ ప్రాధాన్యం
- 32 లక్షల మందికి ఇళ్ల పట్టాల పంపిణీతో చరిత్ర సృష్టించాం
- 31, 29, 44 డివిజన్లలోని సచివాలయాల పరిధిలో ఇళ్ల పట్టాల పంపిణీ



పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: సొంతింటి కలను నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరులోని 31, 29, 44 డివిజన్లలో శుక్రవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ స్థలంతో పాటు ప్రభుత్వం నిర్మించి ఇస్తున్న ఇంటి నిర్మాణానికి సంబంధించి పూర్తి హక్కులు కూడా పేదలకే దక్కేలా చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. జగనన్న ప్రథమ ప్రాధాన్యం మహిళలేనన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఏకంగా 32 లక్షల మందికి ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు నిర్మాణం చేపట్టిన తొలి ప్రభుత్వం జగనన్నదేనన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలంతా ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేసే విషయంలో తమ ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వానికి సాధ్యం కాని విధంగా పని చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చి పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. గతంలో ఇంటి స్థలం రావాలంటే సవాలక్ష కష్టాలు ఉండేవని, ఇప్పుడు సొంత ఊరిలోనే ఉన్న సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేవలం 90 రోజుల్లోనే ఇంటి స్థలం అందజేస్తున్నామని తెలిపారు. మరోసారి తమకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేవలం ఇళ్ల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా వాటిని రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే భరించి రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇస్తున్నదని తెలిపారు. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టామన్నారు. తొలి విడత 15 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. ఇప్పటికి దాదాపు 7.50 లక్షలకు పైగా పూర్తి చేశామని తెలిపారు. మహిళలకు సొంత స్థలం, ఇంటి రూపంలో ఒక పెద్ద ఆస్తిని ప్రభుత్వం చేకూరుస్తోందని చెప్పారు. మహిళలకు తమ పేరు మీద ఇల్లు ఉండడంతో వారికి ఒక భరోసాను ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. ఒక అన్నగా జగనన్న రాష్ట్రంలో ఆడపడుచులకు ఇస్తున్న బహుమానం ఇదని మంత్రి రజిని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలంతా జగనన్నకు అండగా నిలవబోతున్నారని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా పలువురు మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి వెంట ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, స్థానిక నేతలు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఉన్నారు.

సంక్షేమమే సంకల్పంగా ముందుకు సాగుతున్న సీఎం

పట్నంబజారు: సంక్షేమమే సంకల్పంగా ... అభివృద్ధే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నియోజకవర్గంలోని 21వ డివిజన్ కృష్ణబాబు కాలనీలో శుక్రవారం మనతో మన రజినమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో రజిని పర్యటిస్తూ స్థానికుల బాగోగులు తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్థానికులకు వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక విప్లవాత్మక నిర్ణయాలతో పేదలకు మేలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందని తెలిపారు. మేలు జరిగితేనే ఓటు వేయండి అని అడిగే ధైర్యం రాష్ట్రంలో సీఎం జగన్‌కు తప్ప మరెవరికి ఉందని ప్రశ్నించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా, ఎన్ని నీచరాజకీయాలు చేసిన జగనన్న సింహంలా సింగిల్‌గానే పోటీకి వస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెస్ట్ నియోజకవర్గ పరిశీలకులు రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), స్థానిక కార్పొరేటర్ కాండ్రుగుంట గురవయ్య, పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం



లాలుపురంలో అధ్యాపకులు, విద్యార్థినుల ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలపై హెల్మెట్, కార్లలో ప్రయాణించే సమయంలో సీటు బెల్టు ధరించి సురక్షితంగా నడపడం ద్వారా మనతో పాటు కుటుంబానికి భద్రత లభిస్తుందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి సూచించారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల జాతీయ సేవా పథక విభాగం-4 ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన లాలుపురంలో వారం రోజుల ప్రత్యేక శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న కాలంలో ప్రతి ఒక్కరి జీవన విధానం యాంత్రికంగా మారి ఉరుకుల, పరుగుల మయంగా మారిందన్నారు. బైక్, కారు, లారీ, బస్సులను నడిపేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా నడుపుతూ పలువురు ప్రమాదాలకు గురతున్నారని, తద్వారా వారి కుటుంబాలు విచ్ఛిన్నమైపోతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించడంతో పాటు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు హెల్మెట్లు, సీట్ బెల్ట్ ధరించండి-జీవితాన్ని రక్షించుకోండి అంటూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ అధికారి కె.విజయకుమారి కళాశాల అధ్యాపకులు ఖాదర్ బాషా, లక్ష్మీప్రమీల, డి.మల్లికార్జున, డి.ధాత్రీకుమారి, భాస్కరరావు, రఫీ, గ్రామ సచివాలయ కార్యదర్శి పీవీఎస్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువత ముందుండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందంజలో ఉండాలని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి సూచించారు. జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన అడవితక్కెళ్లపాడులో వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో ప్రజల జీవన స్థితిగతులు తెలుస్తాయన్నారు. గ్రామాలకు చేసే సేవ దేశ సేవగా భావించి, అంకితభావంతో చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి పరచుకునేందుకు ఇటువంటి శిబిరాలలో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని రహదారుల వెంట, పాఠశాల ఆవరణలో పిచ్చి చెట్లను తొలగించి, మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డి.రాహుల్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎం.వి.ఎస్. కోటేశ్వరరావు స్మారక యూపీ పాఠశాల ఉపాధ్యాయులు యస్. తాండవకృష్ణ, ఎల్.ఎస్. భారవి, గ్రామ పెద్దలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

రహదారి నిబంధనలు పాటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించాలని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ప్రత్యేక శిబిరంలో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

రైతుల పాలిట కల్పవృక్షాలు - మన గుంటూరు కోల్డ్ స్టోరేజీలు

Advt Special Feature

రైతులకు ప్రయోజనకరంగా కోల్డ్ స్టోరేజీలు

- జిల్లా వ్యాప్తంగా 120కి పైగా రైతులకు సేవలు
- నెలల తరబడి తాజాగా పంటలు
- రైతులకు సహాయకారిగా యజమానులు
- తక్కువ ధరలకే నిల్వ అవకాశం

కొరిటిపాడు(గుంటూరు): గతంలో పంటల్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాలు పడేవారు. ఇళ్లు, పొలాల్లోనూ జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అయితే, కీటకాలు, మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అవస్థలు పడేవారు. కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుతో క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. పండించిన పంట తొలుత ఎలా ఉందో నెలలు గడిచిన, అమ్మే వరకు తాజాగా ఉంటుంది. రైతులకు ప్రయోజనకరంగా జిల్లావ్యాప్తంగా కోల్డ్ స్టోరేజీలు వందల్లో ఏర్పడ్డాయి.

నాణ్యమైన మౌలిక సౌకర్యాలు

గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 90పైగా అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో స్థానిక రైతులతో పాటు ఇతర జిల్లాల్లోని వారు సరుకు భద్రపరుచుకునేందుకు నిర్వాహకులు నాణ్యమైన మౌలిక సౌకర్యాలు కల్పించారు. విశాలమైన గదులు, లిఫ్ట్ సౌకర్యం, రైతులు బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి రైతులు మిర్చిని విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగులను ఆశ్రయిస్తుంటారు. రైతుల రాకతో గిడ్డంగులు నిండు కుండలా మారుతున్నాయి.

రైతులకు సేవల్లో ముందంజ

గిడ్డంగుల యజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. దీని ద్వారా రైతులకు లాభదాయకంగా మారింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు నిర్వహణ చేస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు సైతం తక్కువ ధరలకే పంటలను నిల్వ చేసుకుంటున్నారు. రైతులు నిల్వ ఉంచిన సరుకును ఎంచక్కా అధిక ధరలకు విక్రయించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సరుకు నిల్వపై పురుగు మందుల వాడకం

పురుగు మందుల వాడకం కూడా సరుకు నిల్వపై ప్రభావం చూపుతుందని గిడ్డంగుల యజమానులు అంటున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు మంచి విత్తనాలు తీసుకుని, వారి ఆచరణకు అనుగుణంగా మందుల వాడకం వల్ల అధిక దిగుబడికి అవకాశం ఉంది. దానికితోడు సరుకులో నాణ్యత పెరుగుతుంది. దీనివల్ల రైతులు అందరూ లాభదాయంగా ఉంటారని కోల్డ్ స్టోరేజ్ యజమానులు సూచిస్తున్నారు.

పంట నాణ్యతకు పెద్దపీట

రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులు పండించిన పంటను సకాలంలో అమ్ముకోవాలంటే ఒక్కోసారి కుదరదు. ఎందుకంటే కాస్తంత ధర పలికితే విక్రయించాలని చూస్తుంటారు. ఒక్కొక్కసారి గిట్టుబాటు ధర లభించకపోవచ్చు. ఈ సమయంలో సరుకును గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని ఆశించిన ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు. కొన్ని కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు రైతులకు బ్యాంకు రుణాలు సైతం అందిస్తున్నాయి. ప్రభుత్వం కూడా విద్యుత్తు సబ్సిడీ కల్పిస్తే తక్కువ ధరకే సరుకును భద్రపరుచుకునేందుకు అవకాశం ఉంటుంది.

–తదకమళ్ల సూర్యప్రకాశరావు, ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

గిడ్డంగుల్లో 45 లక్షల మిర్చి బస్తాలు నిల్వ

కోల్డ్‌స్టోరేజ్‌లకు ఇప్పుడిప్పుడే మిర్చి బస్తాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 16 లక్షల టిక్కీలు పాతవి, మరో 29 లక్షల టిక్కీల కొత్త సరుకు చేరుకుంది. రైతులకు మంచి సర్వీసు అందిస్తున్నాం. మొత్తంగా 45 లక్షల బస్తాలను రైతులు నిల్వ చేసుకున్నారు. బస్తా ఒక్కింటికి రూ.210 మాత్రమే వసూలు చేస్తున్నాం. కోవిడ్ కాలంలో కూడా గిడ్డంగులు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. సరుకు నాణ్యతలో గిడ్డంగుల యజమానులు రాజీపడటంలేదు. అందులో శీతలీకరణలో మరింత నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులకు మంచి సర్వీసు ఇవ్వాలన్నది ప్రతి ఒక్కరిలో ఉంది.

–పి.సురేంద్రబాబు, ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి